సాక్షి
పార్వతీపురం మన్యం
శనివారం । 28 । జూన్ । 2025



జిందాల్ రైతులకు వారంలో పరిహారం

జిందాల్ నిర్వాసితులకు వారంరోజుల్లో పరిహారం చెల్లిస్తామని అంబేడ్కర్ తెలిపారు. - 8లో



మద్యం మత్తు వల్లే ప్రమాదం

జోగిందొరవలసలో ఈ నెల 21వ తేదీన వల్లం నాయుడు అనే వ్యక్తి మద్యం మత్తులో ట్రాక్టర్ నడిపి ప్రమాదానికి పాల్పడ్డాడని డీఎస్పీ ఎస్. రాఘవులు తెలిపారు. - 8లో



అక్కరకు రాని ఈఎస్ఐ

ఈఎస్ఐ డిస్పెన్సరీ, డయోగ్నొస్టిక్ సెంటర్స్‌లో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. కార్మికుల్లో ఆవేదన నింపుతున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

చిన్నబగ్గ కొండల్లోకి ఏనుగుల గుంపు



చిన్నబగ్గ కొండల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

సీతంపేట: చిన్నబగ్గ కొండల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. శుక్రవారం ఉదయం కొండదిగువన ఉన్న ఏనుగుల గుంపు సాయంత్రానికి కొండపైకి చేరాయి. జీడి, అరటి చెట్లను ధ్వంసం చేస్తున్నాయి. అటవీశాఖ సిబ్బంది ఏనుగుల గమనాన్ని పరిశీలించి గిరిజనులను అప్రమత్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గిరిజనులు కోరుతున్నారు.

మన్యం బిడ్డలపై మలేరియా పంజా



మలేరియాతో బాధపడుతూ మర్రిపాడు పీహెచ్‌సీలో సేవలు పొందుతున్న చిన్నారులు

సీతంపేట: మన్యం బిడ్డలపై మలేరియా పంజా విసురుతోంది. మంచం పట్టిస్తోంది. మర్రిపాడు పీహెచ్‌సీ పరిధిలో మలేరియా వ్యాధి అధికంగా ఉంది. శుక్రవారం పీహెచ్‌సీలో ఓపీ 40 వరకు రాగా దీనిలో అధికమంది జ్వరపీడితులే ఉన్నారు. మలేరియాతో సౌజన్య, అఖిల్, అజిత్, నారాయణ ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరారు. తోటగూడలో లొంగిరి అనే వృద్ధురాలు, పీవీ ఈతమానుగూడలో ఆరిక అల్లూరి జ్వరంతో మంచం పట్టారు. 80కి పైగా గిరిజన గ్రామాల ప్రజల వైద్యానికి మర్రిపాడు పీహెచ్‌సీయే ఆధారం. గతంతో ఇక్కడ ఇద్దరు వైద్యులు ఉండేవారు. వీరిలో ఒకరు పీజీ చదువుకోవడానికి వెళ్లిపోడంతో కొన్ని నెలలుగా పోస్టు భర్తీకాలేదు. వైద్యురాలు సత్యవేణి ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు. ఓపీ చూడడం, గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించడం కష్టసాధ్యంగా మారింది. మెరుగైన సేవలు అందడం లేదు. కొన్నిసార్లు స్టాఫ్ నర్సులే వైద్యసేవలు అందిస్తున్నారు.

3న వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం

- జెడ్పీచైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు




విజయనగరం: వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం వచ్చే నెల 3న నిర్వహించనున్నట్టు విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు జగన్నాథ ఫంక్షన్ హాల్‌లో జరిగే సమావేశంలో శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబుతోపాటు ఎమ్మెల్సీలు, ఎంపీలు, పీఏసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, ఇతర ముఖ్యనాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతం, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారన్నారు. సమావేశానికి కార్పొరేషన్/ మున్సిపల్ చైర్మన్‌లు, ఎంపీపీలు, పార్టీ మండలాధ్యక్షులు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర/జిల్లా/నియోజకవర్గ/మండల స్థాయి పార్టీ కమిటీలో వివిధ హోదాలోగల సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్‌లు, మాజీ డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్‌లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు.

జిల్లా మైనారిటీ సంక్షేమాధికారిగా కుమారస్వామి



విజయనగరం టౌన్: జిల్లా పర్యాటక శాఖ అధికారిగా పనిచేస్తున్న కుమారస్వామి జిల్లా మైనారిటీ అధికారిగా, కార్పొరేషన్ ఈడీగా ఇన్‌చార్జి బాధ్యతలను శుక్రవారం చేపట్టారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకూ రెండు పోస్టులలో కొనసాగాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

హతవిధీ.. ఉద్యోగీ!



- రిలీవర్ ఉంటేనే బదిలీ
- స్పష్టం చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి
- ఎన్నేళ్లయినా ఇక్కడే చిక్కుకుపోవాల్సిందేనా...

సాక్షి, పార్వతీపురం మన్యం:

జిల్లాలో పని చేస్తూ.. బదిలీపై వెళ్లిపోవాలని ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గట్టి షాక్ ఇచ్చారు. వారి స్థానంలో ఎవరైనా వస్తేనే వీరిని రిలీవ్ చేయాలని స్పష్టం చేశారు. జిల్లా విభజన తర్వాత వచ్చిన ఉద్యోగుల్లో అధిక శాతం మంది దాదాపు మూడేళ్లుగా ఇక్కడే చిక్కుకుపోయారు. వీరిలో కొంతమంది ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖల తోనో.. ఉన్నతాధికారులకు భారీ మొత్తంలో చెల్లించి విజయనగరం, విశాఖ వంటి ప్రాంతాలకు వెళ్లిపోయారు. కొందరు మాత్రం అడిగినంత ఇస్తామని మొత్తుకుంటున్నా.. కదలలేకపోతున్నారు. కీలక విభాగాల్లో పని చేస్తున్న వారి స్థానంలో ఇంకెవరూ రాకపోవడమే కారణం. ఇటీవల దాదాపు అన్ని శాఖల్లోనూ బదిలీలు జరిగాయి. కొంతమంది కదిలినా.. చాలామందికి మాత్రం స్థాన చలనం కలగలేదు. చాలాకాలంగా బదిలీపై ఇక్కడ నుంచి వెళ్తున్న వారే గానీ.. ఆ స్థానంలో ఎవరూ రావడం లేదు. ఈ ప్రభావం జిల్లా పాలనపై పడుతోంది. జిల్లా అధికారుల పోస్టులు సైతం ఖాళీగా ఉండిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉద్యోగాలు తీయకపోవడంతో ఉన్నవారితోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి. రెవెన్యూ, ఐటీడీఏ, వైద్యశాఖ తదితర కీలక విభాగాల్లో బదిలీల కోసం చూస్తున్న వారు అనేకమంది ఉన్నారు. ఇందులో కొంతమంది తమ పలుకుబడితో ఇక్కడి నుంచి వెళ్లినా.. కొంతమంది మాత్రం ఉండిపోయారు. పార్వతీపురం మన్యం జిల్లా మారుమూల ప్రాంతం కావడం.. ఏజెన్సీగా భావిస్తుండటమే ఇందుకు కారణం.

ఎవరినీ వదలద్దని చెప్పేసిన ఇన్‌చార్జి మంత్రి..

జిల్లా పరిపాలనకు అవసరమైన సిబ్బందిలో 50 శాతం మందే ఉన్నారని స్వయనా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పుకొచ్చారు. ఈ ప్రభావం జిల్లా పాలనపై పడుతోందని శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో తెలిపారు. ఇక్కడ ఉండటానికి ఎవరూ ఇష్టపడకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పిన ఆయన.. ఎవరికైనా ఇక్కడ నుంచి బదిలీ అయితే, ఆ స్థానంలో మరొకరు వస్తేనే ముందు వారిని రిలీవ్ చేయాలని స్పష్టం చేశారు. అసలు పార్వతీపురం మన్యం జిల్లాకు వచ్చేందుకే ఎవరూ ఇష్టపడటం లేదు. ఎవరినైనా ఇక్కడకు బదిలీ చేసినా, కొంతమంది వచ్చి సంతకం పెట్టి, సెలవు మీద వెళ్లిపోతున్నారు. మరి కొందరు ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలతోనో.. పై స్థాయిలో పరిచయాలతోనో తమ ఉత్తర్వులు రద్దు చేయించుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తాము ఇక్కడ నుంచి ఎలా వెళ్లగలమని జిల్లాలో పని చేస్తున్న పొరుగు జిల్లాల ఉద్యోగులు వాపోతున్నారు. ఎన్నాళ్లయినా ఇక్కడే ఉండిపోవాలా? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీతాలు ఇవ్వడం లేదు...



మంత్రికి సమస్యను తెలియజేస్తున్న మహిళా పోలీసులు

పార్వతీపురం రూరల్/పార్వతీపురం: గతంలో టంచన్‌గా అందే జీతాలు ఆరు నెలలుగా అందడం లేదని, అడిగితే ఆర్థిక శాఖ అనుమతులు ఇవ్వడం లేదని చెబుతున్నారని, ఉద్యోగభద్రతతో పాటు జీతాలు నెలవారీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలంటూ వైఎస్సార్ ఉద్యానవన కళాశాల సెక్యూరిటీ గార్డులు మంత్రి అచ్చెన్నాకుడుకు విన్నవించారు. తమను ఆప్కాస్‌లోనే కొనసాగించాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లాకు వచ్చిన ఆయనకు వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో శంకరరావు, రమేష్, బలరాం, ముత్యాలరావు, రామారావు, జమ్మయ్య, భూషణ్, రామకృష్ణ, మౌళి తదితరులున్నారు.

మహిళా పోలీసుల పడిగాపులు

సచివాలయ మహిళా పోలీస్ సిబ్బందికి శనివారం జరగనున్న బదిలీలపై స్పష్టత ఇవ్వాలని, ఇతర మండలాలకు వేస్తే ఇబ్బందులు పడతామంటూ మంత్రి అచ్చెన్నాయుడుకు విన్నవించేందుకు కలెక్టరేట్ వద్ద దాదాపు 4 గంటల సమయం పడిగాపులు కాశారు. భోజన విరామ సమయంలో కొంతమంది మాత్రమే లోపలకు వెళ్లి మంత్రికి తెలిపే ప్రయత్నం చేసి వినతిపత్రాన్ని అందజేశారు. తమకు సమయం లేదని రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యకు పరిష్కారం చూపాలని మంత్రికి తెలిపారు. ప్రభుత్వం ఈ బదిలీలపై ఆలోచించడం జరుగుతుందని, ఇప్పుడే ఒక నిర్ణయానికి రాలేమని మంత్రి సమాధానం ఇచ్చారు. శనివారమే బదిలీల ప్రక్రియ ప్రారంభం కావడంతో స్పష్టమైన హామీ రాకపోవడంతో మహిళా పోలీసు సిబ్బంది నిరాశతో వెనుదిరిగారు.

కనులపండువగా జగన్నాథుని రథయాత్ర



మంగళ వాయిద్యాలు, భక్తుల జయజయ ధ్వానాలు, భజనల నడుమ వీరఘట్టంలో జగన్నాథుని రథయాత్ర శుక్రవారం వైభవంగా సాగింది. తొలుత యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ దంపతులు, అర్చకుడు లింగరాజ్‌రథో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం రథంపై సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి యాత్రను ప్రారంభించారు. పట్టణ వీధుల్లో రథంపై వస్తున్న స్వామివారిని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. దేవదాయశాఖ ఈఓ సూర్యనారాయణ యాత్రను పర్యవేక్షించారు. - వీరఘట్టం

అంధకారంలో అవస్థలు



చిత్రంలో చిమ్మచీకటిలో ఆరుబయట కూర్చున్నవారంతా నిండు గర్భిణులు. డెలివరీ సమయం దగ్గర పడడంతో గిరిశిఖర గ్రామాల నుంచి గుమ్మలక్ష్మీపురంలోని యూత్ ట్రెనింగ్ సెంటర్ (వైటీసీ)లో నిర్వహిస్తున్న గర్భిణుల వసతి గృహంలో చేరారు. భారీ వర్షం కారణంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారంలోనే గడిపారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. రాత్రంతా ఆరుబయటే జాగారం చేయాల్సిన పరిస్థితి. వైటీసీ సిబ్బంది సమాచారంతో విద్యుత్ సరఫరా పనులను సంబంధిత సిబ్బంది చేపట్టారు. అయితే, ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వైటీసీకి సరఫరా అయ్యే విద్యుత్ తీగెలు అండర్ గ్రౌండ్‌లో ఉండడంతో సరఫరాను పునరుద్ధరించలేకపోయారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో గర్భిణులు ఊపిరిపీల్చుకున్నారు. వైటీసీకి జనరేటర్ సదుపాయం కల్పించాలని ప్రభుత్వానికి గర్భిణుల బంధువులు విజ్ఞప్తిచేశారు. - గుమ్మలక్ష్మీపురం



రేకుల షెడ్‌లో కూర్చొన్న ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులు

ఒక గది.. నాలుగు తరగతులు..!

- ఉపాధ్యాయుడూ ఒక్కరే..
- ఇదీ ములక్కాయవలస ప్రాథమిక పాఠశాల దుస్థితి

పార్వతీపురం రూరల్:

మానవుడు అంతరిక్షాన్ని చుట్టి వస్తున్న రోజుల్లోనూ గిరిజన ప్రాంత ప్రజలను విద్య, వైద్య కష్టాలు వీడడంలేదు. దీనికి పార్వతీపురం మండలం గోచెక్క పంచాయతీ ములక్కాయ వలస గ్రామంలోని గిరిజన ప్రాథమిక పాఠశాలే నిలువెత్తు నిదర్శనం. గత ప్రభుత్వంలో రెండోవిడత నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలకు నూతన భవనాన్ని మంజూరు చేసింది. ప్రభుత్వం మారడంతో పాఠశాల భవనం పునాదులకే పరిమితమైంది. అనంతరం వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో కనీసం పాఠశాల వైపు కన్నెత్తి చూడలేదు. ఫలితం.. విద్యార్థులను వసతి కష్టాలు వెంటాడుతున్నాయి.



చిన్నారులకు బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

తాత్కాలికంగా వేసిన చిన్న రేకుల షెడ్‌లోనే ఆరు గ్రామాల నుంచి వస్తున్న చిన్నారులకు ఉపాధ్యాయుడు పాఠ్యాంశ బోధన చేస్తున్నారు. ప్రస్తుతం నాలుగు తరగతుల విద్యార్థులకు ఇరుకు గదిలో బోధన సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.



ఈ షెడ్డులోనే అన్ని తరగతుల నిర్వహణ



అసంపూర్తిగా నిలిచిపోయిన పాఠశాల భవనం

గిరిజనులపై చిన్నచూపెందుకో?



గిరిజనులకు అది చేస్తున్నాం... ఇది చేస్తున్నామంటూ కూటమి ప్రభుత్వం ప్రచారానికే పరిమితం అవుతుందేతప్ప ఇప్పటికే పేరుకుపోయిన సమస్యలపై దృష్టిసారించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ములక్కాయవలస పాఠశాల వంటివి జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఉన్నాయి. విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సమస్యల పరిష్కారంవైపు అధికారులతో పాటు పాలకులు కూడా కన్నెత్తి చూడడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందో అధికారులే సమాధానం చెప్పాలి. తక్షణమే పునాదుల దశలో ఉన్న పాఠశాల భవనాన్ని పూర్తిచేయాలి.

- బి.రవికుమార్, అఖిల భారత విద్యార్థి సమైక్య నాయకుడు, పార్వతీపురం

సమన్వయలోపం ఉంది.. సరిదిద్దుకుంటున్నాం!

- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి
- జంఝావతి, కొఠియా అంతర్రాష్ట్ర వివాదాలను త్వరలో పరిష్కరిస్తాం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం రూరల్: జిల్లాలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ, పాడి పరిశ్రమ, మత్స్యశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కొంత సమచారలోపం వల్లే ఇది ఏర్పడిందని.. దీనిపై బహిరంగంగానే చర్చించామని, సరిదిద్దుతున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల అమల్లో జిల్లా మంత్రి, పజాప్రతినిధులకు ముందస్తు సమాచారాన్ని చేరవేస్తూ సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' ప్రారంభోత్సవ కార్యక్రమం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ అంశాలపై సమీక్షించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లా మారుమూల గిరిజన ప్రాంతం అయినప్పటికీ జీడీపీలో 16.94 శాతం వృద్ధి సాధించి రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు కూడా పని చేయాలని సూచించారు. వరితో పాటు ఉద్యానవన పంటలను ప్రోత్సహించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో ప్రతి రైతూ సభ్యునిగా చేరాలని, తద్వారా వ్యవసాయ రుణాలను పొందవచ్చని మంత్రి హితవు పలికారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు జిల్లా అనుకూలంగా ఉన్నందున పారిశ్రామిక వేత్తలతో మాట్లాడి యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే జీడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటైందని.. దాంతో పాటు జీడి, మామిడి, పైనాపిల్ వంటి ఇతర యూనిట్ల స్థాపనకు ఆలోచన చేయాలని తెలిపారు. సాగు నీటి వినియోగం కోసం అవసరమైన లష్కర్లను రానున్న నాలుగు మాసాల్లోగా వేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. జంఝావతి ప్రాజెక్టు, కొఠియా గ్రామాల అంతర్రాష్ట్ర వివాదాలను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. కుంకీ ఏనుగుల మొదటి ఆపరేషన్ జిల్లాలోనే చేపట్టేలా కోరామని చెప్పారు. పీపీపీ విధానంలోనే వైద్య కళాశాల చేపడతామని స్పష్టం చేశారు. సమాచార శాఖ ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే విజయ్‌చంద్రలతో కలసి పరిశీలించారు. వ్యవసాయ శాఖ ఏర్పాటుచేసిన స్టాల్‌ను సందర్శించి రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం పార్వతీపురం మార్కెట్ యార్డులో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన జీడి ప్రాసెసింగ్ యూనిట్‌ను తనిఖీ చేశారు.

కూటమిలో విభేదాలు.. బీజేపీ, జనసేన దుమ్మా!

'సుపరిపాలనలో తొలి అడుగు'.. అంటూ రాష్ట్రంలో మొదటి సమావేశం పార్వతీపురం మన్యం జిల్లాలోనే చేపట్టారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో కూటమిలోని విభేదాలు బయటపడ్డాయి. కార్యక్రమానికి టీడీపీ మినహా.. కూటమిలోని జనసేన, బీజేపీ నాయకులు హాజరు కాలేదు. ఏ ఒక్కరికీ ఆహ్వానం అందలేనట్లు తెలుస్తోంది. పాలకొండ జనసేన ఎమ్మెల్యే జయకృష్ణ కూడా గైర్హాజరయ్యారు. ఆయన స్థానికంగా లేరని సమాచారం. తమకు ఆహ్వానం అందకపోవడంపై రెండు పార్టీల నాయకులూ గుర్రుగా ఉన్నారు. తమను పట్టించుకోవడం లేదని ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎదుట కూటమి భాగస్వామ్యంలోని బీజేపీ నాయకులు మొరపెట్టుకున్నారు. తాను అంతా సరిదిద్దుతానని అప్పట్లో మంత్రి వారికి హామీ ఇచ్చారు. పరిస్థితిలో మార్పు రాకపోవడంతో మరలా ఫిర్యాదు చేసేందుకు వారు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

సిగ్నల్ లేక.. సకాలంలో 108 రాక..

- గంటన్నర పాటు నరకం చూసిన రోడ్డు ప్రమాద బాధితుడు
- ఆస్పత్రికి తరలించేందుకు అవస్థలు
- ఘాట్ రోడ్‌లో ఆటోబోల్తా



సకాలంలో 108 అంబులెన్స్ చేరుకోకపోవడంతో బాధితునికి సపర్యలు చేస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్లో) బోల్తాపడిన ఆటో

సీతంపేట: మొబైల్ సిగ్నల్ లేక.. సకాలంలో 108 అంబులెన్స్ రాక రోడ్డు ప్రమాద బాధితుడు గంటన్నర పాటు నరకం చూసిన ఘటన సీతంపేట మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... సీతంపేట మండలంలోని మారుమూలన ఉన్న బంజారుగూడ-పుట్టిగాం మధ్య ఎత్తైన ఘాట్‌రోడ్డులో శుక్రవారం మధ్యాహ్నం 12.10 గంటల సమయంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో మెట్టూరుకు చెందిన వీరన్నకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సమయంలో అక్కడ 108కు ఫోన్ చేద్దామని ఆటోలో ఉన్న కుటుంబ సభ్యులంతా ఎంత ప్రయత్నించినా సెల్‌సిగ్నల్ లేకపోవడంతో వీలు పడలేదు. స్థానికులు సెల్‌సిగ్నల్ చోటకు పరుగుతీసి 108కు సమాచారం అందించారు. సీతంపేట, కొత్తూరు 108 అంబులెన్స్‌లు ఖాళీగా లేకపోవడంతో భామిని అంబులెన్స్ వస్తుందని సమాచారం ఇచ్చారు. మారుమూల ప్రాంతం కావడం, బాధితుల సెల్‌ఫోన్‌కు సిగ్నల్ లేకపోవడం వంటి కారణాలతో భామిని అంబులెన్స్ వచ్చేసరికి మధ్యాహ్నం 1.50 అయ్యింది. అప్పటికే వీరన్నకు తీవ్ర రక్తస్రావం అయ్యింది. అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి సీతంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పరామర్శకు వెళ్లి ప్రమాదం పాలై..

శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలానికి చెందిన వీరన్న, అతని కుటుంబ సభ్యులు, బంధువులు ఒకే ఆటోలో మర్రిపాడు మీదుగా కురుపాం మండలం గగాలి గ్రామానికి ఓ మృతుని కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఘాట్ రోడ్డు దిగుతుండగా ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ప్రమాదం జరిగింది. ఇందులో వీరన్నకు తీవ్ర గాయాలు కాగా, మిగిలిన వారు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు.

పీఎంఎఫ్‌బీవైపై విస్తృత ప్రచారం

విజయనగరం అర్బన్: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం చేయాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అధికారులకు సూచించారు. పంటల బీమా పథకం వివరాలు తెలియజేసే కరపత్రాలు, పోస్టర్లను జేసీ తన చాంబర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సమయంలో వరి, మొక్కజొన్న, నువ్వులు, పత్తి తదితర పంటల పాడైతే పీఎంఎఫ్‌బీవై కింద పరిహారం అందుతుందన్నారు. రైతులు ప్రీమియం చెల్లించి లబ్ధిపొందాలని కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి వీటీ రామారావు మాట్లాడుతూ పంటల బీమా పథకాన్ని వరి పంటకు గ్రామం యూనిట్‌గాను, మొక్కజొన్న, నువ్వు పంటలకు మండలం యూనిట్‌గా అమలు చేస్తారని, పత్తి పంటకు వాతావరణ పరిస్థితులు ఆధారంగా మండలం యూనిట్‌గా అమలు చేస్తారని తెలిపారు.

క్లుప్తంగా

పైడితల్లికి స్వర్ణపుష్పార్చన



స్వర్ణ పుష్పాలతో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికి ఆలయంలో శుక్రవారం స్వర్ణ పుష్పార్చన చేశారు. వేకువజామునుంచి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, వేదపండితులు సాయికిరణ్, అచ్యుతశర్మ, దూసి శివప్రసాద్‌లు శాస్త్రోక్తంగా అమ్మవారికి స్వర్ణ పుష్పార్చన సేవను నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కె.శిరీష కార్యక్రమాలను పర్యవేక్షించారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం



భోజనం హోటల్‌లోకి దూసుకుపోయిన కారు

బాడంగి: ఓ కారు అదుపుతప్పి భోజనం హోటల్‌లోకి దూసుకు పోయిన సంఘటనలో అదృష్టవశాత్తు పెనుప్రమాదం తప్పింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. టెక్కలి నుంచి జయపూర్ వెళ్తున్న కారు స్పీడ్ బ్రేకర్ల మూలంగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ముందుటైర్లు రాయిపైకి ఎక్కిపోవడంతో స్టీరింగ్ అదుపుతప్పింది. దీంతో మండలకేంద్రంలో పోలీస్‌స్టేషన్ ఎదురుగా గల ఎం.చైతన్య భోజనం హోటల్‌లోకి కారు ఒక్కసారిగా దూసుకుపోయింది. అయితే ఆ హోటల్‌లో టిఫిన్ సెక్షన్ లేకపోవడంతో పాటు ఉదయం 8గంటల సమయం కావడంతో పనివారు హోటల్ లోపల ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బయట ఎవరూ లేకపోవడంతో ప్రాణహాని తప్పిందని హోటల్ సిబ్బంది భయాందోళనతో చెప్పారు.

మహిళపై కత్తిపీటతో దాడి

వేపాడ: మండలంలోని నల్లబిల్లి గ్రామానికి చెందిన మహిళపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి కత్తి పీటతో దాడి చేసినట్లు వల్లంపూడి పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం గ్రామానికి చెందిన ఉడతా మణికంఠ గ్రామంలోని ఈర్లి సీతారాం (62)ఇంటికి వెళ్లి మంచినీళ్లు అడిగాడు. మంచినీళ్లు ఇవ్వడానికి ఆమె గదిలోకి వెళ్లగా మెడలోని బంగారం తాడు తుంచి వేయడానికి మణికంఠ ప్రయత్నం చేశాడు. దీంతో సీతారాం కేకలు వేయగా పరిసరాల్లో ఉన్న వ్యక్తులు వచ్చేసరికి ఇంట్లో ఉన్న కత్తిపీటతో సీతారాం మెడపై మణికంఠ దాడి చేసి గాయపర్చాడు. స్థానికులు వెంటనే 108కు సమాచారమిచ్చి కోటపాడు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవలకు విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. సమాచారం మేరకు ఎస్.కోట రూరల్ ఎస్సై ఎల్.అప్పలనాయుడు గ్రామానికి వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి కుమారుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹100	₹170	₹180



జిందాల్ రైతులకు వారంలో పరిహారం

- సమీక్షించిన కలెక్టర్ అంబేడ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిందాల్ భూములకు సంబంధించి రైతులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పరిహారాన్ని వారంరోజుల్లో అందజేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. జిందాల్ కోసం సేకరించిన భూములపై తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. ఇప్పటివరకు చెల్లించిన పరిహారం, పెండింగ్ బకాయిలపై ఆరా తీశారు. సుమారు 28 ఎకరాలకు సంబంధించి 15 మంది రైతులకు మాత్రమే పరిహారం పెండింగ్ ఉందని, వారికి వెంటనే పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు జిందాల్ చెల్లించాల్సిన పరిహారంపైనా చర్చించారు. పదిరోజుల్లో పెండింగ్ బకాయిలను రైతులకు చెల్లించాలని జిందాల్ యాజమన్యాన్ని కలెక్టర్ ఆదేశించారు.

జిందాల్ భూముల్లో ఎంఎస్‌ఎంఈ పార్క్

జిందాల్ భూముల్లో ఎంఎస్‌ఎంఈ పార్కును ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ చెప్పారు. ఈ మేరకు నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిందాల్ భూములకు సంబంధించి కేవలం 15 మంది రైతులకు మాత్రమే బకాయి ఉందని చెప్పారు. జిందాల్ పరిశ్రమకు అప్పట్లోనే సుమారు 1,166 ఎకరాలను ప్రభుత్వం అప్పటించిందన్నారు. ఈ భూముల్లో 180 ఎకరాలను జిందాల్ యాజమాన్యమే నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసిందని చెప్పారు. ఇది కాకుండా మొత్తం 375 మంది రైతుల నుంచి 834 ఎకరాల అసైన్డ్ భూమిని, 151 ఎకరాల ప్రభుత్వ భూమిని జిందాల్‌కు కేటాయించినట్లు తెలిపారు. జిందాల్ కోసం ఒక్క ఎకరం భూమిని కూడా రైతుల దగ్గర సేకరించలేదని, 2013 భూసేకరణ చట్టం ఇక్కడ వర్తించదని కలెక్టర్ స్పష్టం చేశారు. మొత్తం 28.72 ఎకరాలకు సంబంధించి 15 మంది రైతులకు ఉన్న బకాయిని వారం రోజుల్లో చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 1962లో మొత్తం 20 మందికి పట్టాలు ఇవ్వగా వారిలో నలుగురు మాత్రమే ఇళ్లు కట్టుకోగా, వారికి అప్పట్లోనే పరిహారం చెల్లించినట్లు తెలిపారు. షేర్లు, ఉద్యోగ కల్పన, వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు సంబంధించి జిందాల్ యాజమాన్యమే రైతులతో నేరుగా ఒప్పందం కుదుర్చుకుందని దానిలో ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్‌కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డీసీఎంఎస్ చైర్మన్ గొంపకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, ఎస్‌కోట తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ డి సెక్షన్ సూపరింటెండెంట్ తాడ్డి గోవింద, ఇతర అధికారులు, జిందాల్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ వ్యాధిని పూర్తిగా అరికట్టాలి

- కలెక్టర్ బీఆర్. అంబేడ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: సికిల్‌సెల్ వ్యాధిని పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం ఆయన వైద్యారోగ్యశాఖ, గిరిజన సంక్షేమశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వ్యాధి గ్రస్తులకు సికిల్‌సెల్ వ్యాధిపై అవగాహన కల్పించాలని కోరారు. గిరిజన గ్రామాల్లో 44 వేల మంది జనాభా నివసిస్తున్నారని, వారిలో 40 సంవత్సరాల లోపు జనాభా 22 వేలు ఉన్నారన్నారు. 17 వేల మందికి సికిల్ సెల్ టెస్టులు చేయగా ఇద్దరికి వ్యాధి ఉన్నట్లు తేలిందని చెప్పారు. 118 మందికి వ్యాధి వచ్చే అవకాశం ఉందని నిర్ధారణ అయినట్లు తెలిపారు. వారే కాకుండా ప్రస్తుతం జిల్లాలో 160 మంది వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నారని, వారికి అందిస్తున్న వైద్యంపై వారం రోజుల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వ్యాధి వచ్చే అవకాశం ఉన్న 118 మందితో సమావేశం నిర్వహించి వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి, డీఎల్‌ఓ డాక్టర్ రాణి, డీఈఓ మాణిక్యం నాయుడు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అన్నపూర్ణ, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ అరుద్ర, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అసోసియేట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ శివకుమార్, డాక్టర్ అర్చన, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తు వల్లే ప్రమాదం

- ప్రమాదానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్



నిందితుడు వల్లంనాయుడి అరెస్టు చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాఘవులు, పక్కన సీఐ కె.నారాయణరావు

రామభద్రపురం: మండలంలోని జోగిందొరవలసలో ఈ నెల 21వ తేదీన వల్లం నాయుడు అనే వ్యక్తి మద్యం మత్తులో ట్రాక్టర్ నడిపి ప్రమాదానికి పాల్పడ్డాడని డీఎస్పీ ఎస్. రాఘవులు తెలిపారు. జోగిందొరవలసలో ట్రాక్టర్ ప్రమాదానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకుని అరెస్ట్ చూపారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రమాదానికి సంబంధించి వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలి మండలం మోసూరువలసకు చెందిన వంగపండు వల్లంనాయుడు, మోసూరు భాస్కరరావు, లక్ష్మణరావులు స్నేహితులు. అయితే వల్లంనాయుడు స్నేహితులిద్దరికి ఫోన్‌చేసి మద్యం తాగుదాం రమ్మని ఆహ్వానించాడు. ముగ్గురులో ఇద్దరు ద్విచక్రవాహనంపై, ఒకరు బ్లేడ్ ట్రాక్టర్‌పై రామభద్రపురం మండలంలోని జోగిందొరవలస గిరిజన గ్రామానికి వెళ్లి అక్కడ మందు తాగారు. ఆ తర్వాత వల్లంనాయుడు మద్యం మత్తులో భాస్కరరావు బైక్ తాళం తీసుకున్నాడు. నా తాళం ఇవ్వు అని భాస్కరరావు ఎంతసేపు అడిగినా వల్లం నాయుడు ఇవ్వలేదు. దీంతో భాస్కరరావు ట్రాక్టర్ వెళ్లనివ్వనని చెప్పి బోయినెట్‌పై కూర్చున్నాడు. మద్యం మత్తులో ఉన్న వల్లం నాయుడు కూడా ట్రాక్టర్ ఎక్కి స్టార్ట్ చేసి ముందుకు లాగించేశాడు. ఆ రోడ్డు గోతులమయంగా ఉండడం వల్ల ప్రమాదవశాత్తు భాస్కర రావు కింద పడిపోవడంతో ట్రాక్టర్ చక్రాలు వెళ్లిపోగా వెనుక ఉన్న బ్లేడ్స్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసునమోదు చేసిన సీఐ కె.నారాయణరావు, ఎస్సై వి.ప్రసాదరావు దర్యాప్తు చేశారు. ప్రమాదం జరుగుతుందని తెలిసి కూడా నిందితుడు అలా వ్యవహరించం వల్ల ప్రమాదకేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఏఎస్సై అప్పారావు పాల్గొన్నారు.

ఎత్తుకు పై ఎత్తు వేస్తున్న ఆటగాళ్లు..!

- ఆసక్తికరంగా చెస్ పోటీలు



రెండవ రోజు జరిగిన పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

విజయనగరం: చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 5వ జాతీయ స్థాయి దివ్యాంగుల జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు రెండవ రోజు ఆసక్తికరంగా సాగాయి. జిల్లా కేంద్రంలోని మెసానిక్ టెంపుల్‌లో నిర్వహిస్తున్న రెండోరోజు పోటీలను చిన్న శ్రీను సోల్జర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో ఆత్మీయంగా మాట్లాడిన ఆమె పోటీల్లో విజేతలుగా నిలవాలంటూ ప్రోత్సహించారు. ఇదిలా ఉండగా దేశంలోని 16 రాష్ట్రాలకు చెందిన106 మంది క్రీడాకారులు జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో తలపడుతుండగా..రెండవ రోజు ముగిసే సమయానికి 8 రౌండ్‌లు పూర్తయినట్లు చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం జిల్లా కార్యదర్శి కేవీ జ్వాలాముఖి తెలిపారు. శనివారం 9వ రౌండ్ ముగిసిన అనంతరం విజేతలను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ కేటగిరీల్లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్న క్రీడాకారులను త్వరలో జరగనున్న అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామన్నారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శులకు మెమోలు జారీ

విజయనగరం: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏడుగురు సచివాలయ కార్యదర్శులకు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య మెమోలు జారీ చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన నగరంలోని పలుప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనితీరును గమనించారు. ప్రజారోగ్య సిబ్బంది నిర్ణీత సమయానికి విధులకు హాజరవుతున్నారా? లేదా? అని గమనించారు. అలాగే కాలువల పరిశుభ్రత, రహదారుల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం 24 వ నంబర్ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డుల నిర్వహణలో ఏడుగురు కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించి వారందరికీ మెమోలు జారీచేశారు. ఇటువంటివి సంఘటనలు పునరావృతమైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మందలించారు. విధుల పట్ల అప్రమత్తగా ఉండాలని సూచించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

వేపాడ: విశాఖ జిల్లా పద్మనాభం మండలం కోడిగుడ్లపెంట గ్రామానికి చెందిన, ప్రస్తుతం పెందుర్తిలో నివాసముంటున్న ముమ్మలూరి సుగుణ(33) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు వల్లంపూడి పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుగుణ కుమార్తె రజస్వల కావడంతో దేవరాపల్లి పరిసర ప్రాంతాల్లోని బంధువులకు చెప్పడానికి ఈ నెల 25న భర్తతోకలిసి బైక్‌పై వెళ్లి తిరిగి పెందుర్తి వస్తుండగా వేపాడ మండలం సంజీవ మెట్ట సమీపంలో ఆనందపురం నుంచి దేవరాపల్లి వెళ్తున్న మరో ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. దీంతో రోడ్డుపై పడిపోయిన సుగుణ తలకు బలమైన గాయమైంది. వెంటనే విశాఖలోని కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ 26న రాత్రి చనిపోయింది. దీనిపై మృతురాలి భర్త గుల్లిపల్లి మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాచ్‌మన్ హత్య కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాఘవులు

బొబ్బిలి: పట్టణంలోని గ్రోత్‌సెంటర్‌లో గల రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న కనిమెరకల వెంకట రమణ హత్య కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు చీపురుపల్లి డీఎస్పీ ఎస్ రాఘవులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాఘవులు నిందితుడి అరెస్టు చూపించి వివరాలను వెల్లడించారు. హతుడు వెంకటరమణ కుమార్తెతో వివాహేతర సంబంధం పెట్టుకున్న పాత బొబ్బిలిలోని చికెన్‌షాపులో పనిచేస్తున్న కోట సర్వేశ్వర రావు ఈ కేసులో నిందితుడని స్పష్టం చేశారు. వాచ్‌మన్ కనిమెరకల వెంకటరమణ విధుల్లో ఉండగా ఈనెల 20న రాత్రి గుర్తు తెలియని దుండగులు దాడి చేయడంతో బొబ్బిలి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించాడు. భర్తతో గొడవలున్న తన కుమార్తెతో వివాహేతర సంబంధం పెట్టుకున్న సర్వేశ్వర రావును వెంకటరమణ గట్టిగా హెచ్చరించాడు. దీంతో కక్ష పెంచుకున్న సర్వేశ్వరరావు గ్రోత్ సెంటర్‌కు వెళ్లి వెంకటరమణపై దాడి చేశాడు. సీసీ టీవీ ఫుటేజీ, కాల్‌డేటా, సంఘటన స్థలం వద్ద దొరికిన పర్స్ ఆధారంగా విచారణ జరిపి నిందితుడ్ని ప్రశ్నించడంతో నేరం అంగీకరించాడని డీఎస్పీ తెలిపారు. నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును త్వరగా ఛేదించడంలో ప్రతిభ కనబర్చిన సీఐ కె.సతీష్‌కుమార్, ఎస్సై రమేష్, సిబ్బందిని డీఎస్పీ రాఘవులు అభినందించారు.

స్త్రీనిధి జిల్లా టార్గెట్ రూ.86 కోట్లు



మాట్లాడుతున్న స్త్రీనిధి జిల్లా ఏజీఎం కామరాజు

సీతానగరం: జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధికి వివిధరకాల వృత్తులపై శిక్షణ ఇవ్వడంతోపాటు బ్యాంకుల ద్వారా రుణసదుపాయం కల్పించనున్నట్లు వెలుగు స్త్రీనిధి జిల్లా ఏజీఎం పి.కామరాజు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని మండల వెలుగు సమాఖ్య కార్యాలయంలో వెలుగు ఏపీఎం రెడ్డిశ్రీరాములు అధ్యక్షతన సిబ్బందితో స్త్రీ నిధి రుణసదుపాయాలపై ఆయన శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీఎం కామరాజు మాట్లాడుతూ 2025–26 సంవత్సరానికి జిల్లా టార్గెట్ రూ.86 కోట్లుండగా ఇప్పటి వరకూ రూ.9 కోట్ల 20లక్షలు పొదుపు సంఘాల సభ్యులకు ఇచ్చినట్లు చెప్పారు. మండలసమాఖ్య పర్యవేక్షణలో అర్హులైన వారందరికీ జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా స్త్రీ నిధి రుణాలు బ్యాంకుల ద్వారా సమకూర్చనున్నామన్నారు. అలాగే సీతానగరం మండలం టార్గెట్ రూ.8 కోట్లు ఉండగా ఇప్పటివరకూ రూ.90 లక్షలు రుణ సదుపాయం కల్పించినట్లు చెప్పారు. వృత్తి పనిలో శిక్షణ పొందిన వారంతా ఆర్థికంగా లబ్ధిపొందడానికి వివిధ రకాల వ్యాపారాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య సభ్యులు సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖతర్‌లో వెల్డర్స్ ఉద్యోగాలు

పార్వతీపురం టౌన్: ఖతర్ దేశంలో వెల్డర్స్ ఉద్యోగాల నియామకం కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భారీగా ఉద్యోగ నియామక డ్రైవ్ చేపట్టినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయి కృష్ణ చైతన్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థుల వయస్సు 24 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలని, ఐటీఐ లేదా ఐటీసీ విద్యార్హత ఉండి నాలుగు సంవత్సరాల అనుభవం ఉండాలని పేర్కొన్నారు. టీఐజీ లేదా ఏఆర్సీ మల్టీవెల్డర్ ఉద్యోగానికి ఎంపికైన వారికి రూ.52 వేల నుంచి రూ 61,500, టీఐజీ లేదా ఏఆర్సీ వెల్డర్ ఉద్యోగానికి రూ.42,500 నుంచి రూ.52వేల వరకు వేతనం ఇస్తారని స్పష్టం చేశారు. కాంట్రాక్ట్ కాలం రెండేళ్లు ఉంటుందని, ఉచిత వసతి, భోజన, వైద్య సదుపాయం, రవాణా సౌకర్యం, స్వదేశానికి ఒక్కసారి వచ్చి పోవడానికి టికెట్ సౌకర్యం ఉంటుందన్నారు. పాస్‌పోర్టులు, అనుభవం, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు అభ్యర్థులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటాను rkiinternational@aprrdc.inకు పంపాలని, మరిన్ని వివరాల కోసం ఫోన్ 9988853335, 8712655686 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అందుబాటులోకి ఎంఆర్‌ఐ స్కాన్

సాక్షి ఎఫెక్ట్



రోగికి ఎంఆర్‌ఐ స్కాన్ తీస్తున్న దృశ్యం

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఎంఆర్‌ఐ స్కాన్ పనిచేయక పోవడం వల్ల రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఈ అంశంపై సాక్షిలో ఈనెల 25వతేదీన సర్వజన ఆస్పత్రిలో పనిచేయని ఎంఆర్‌ఐ శీర్షికన ప్రచురించిన కథనానికి ఆస్పత్రి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఎంఆర్‌ఐ స్కాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

'మత్తు' జోలికి వెళ్లొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ బంగారు పాప

విజయనగరం క్రైమ్: మత్తుపదార్థాల జోలికి వెళ్లవద్దని స్థానిక టాస్క్‌ఫోర్స్ సీఐ బంగారు పాప సూచించారు. నగర పరిధిలోని కస్పా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై ఎంతో మంది యువత తమ బంగారు భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని, కన్నవారికి తీరని శోకం మిగుల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని తెలిపారు.

అక్కరకు రాని ఈఎస్‌ఐ

- ఎక్స్‌రేకు దిక్కులేదు
- అరకొరగా రక్తపరీక్షలు
- శిథిలావస్థలో భవనాలు
- జరగని ఎల్‌ఎఫ్‌టీ పరీక్షలు



ఈఎస్‌ఐ డయోగ్నొస్టిక్ సెంటర్

విజయనగరం ఫోర్ట్: కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తాం. ఈఎస్‌ఐ డిస్పెన్సరీ, డయోగ్నొస్టిక్ సెంటర్స్‌లో సౌకర్యాలు కల్పిస్తాం అంటూ కూటమి ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. కానీ ఆ గొప్పమాటలు అమలుకు నోచుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంక్షేమం మాట దేవుడెరుగు. కార్మికులకు కనీస సౌకర్యాలు కూడా అందని పరిస్థితి ఉంది. దీంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. కార్మికులు ఏదైనా జబ్బు చేసినా, ప్రమాదం జరిగినా చికిత్స కోసం వచ్చే ఈఎస్‌ఐ డయోగ్నొస్టిక్ సెంటర్‌లో సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

ఎక్స్‌రేకు రేడియోగ్రాఫర్ కరువు

ఈఎస్‌ఐ డయోగ్నొస్టిక్ సెంటర్‌లో ఎక్స్‌రేకు దిక్కు లేకుండా పోయింది. సెంటర్‌కు ఎక్కువగా ఎముకల సంబంధిత వ్యాధులతో కార్మికులు వస్తారు. అదేవిధంగా పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు గాయాలతో వస్తారు. వారికి వ్యాధి నిర్ధారణ కోసం ఎక్స్‌రే తీయాల్సి ఉంటుంది. అయితే డయోగ్నొస్టిక్ సెంటర్‌లో ఎక్స్‌రే మిషన్ ఉన్నప్పటికీ తీసే నాథుడు లేకపోవడం వల్ల కార్మికులు ప్రైవేట్ ల్యాబొరేటరీలకు కార్మికులు వెళ్లి రూ. 300 నుంచి రూ. 350 వరకు వెచ్చించాల్సి వస్తోంది. అదేవిధంగా అల్ట్రాసౌండ్ స్కాన్ ఉన్నప్పటికీ రేడియాలజిస్టు లేకపోవడంతో గైనకాలజిస్టులు అల్ట్రాసౌండ్ స్కాన్ చేస్తున్నారు.

సెంటర్‌లో ఓపీ విభాగాలు

ఈఎస్‌ఐ డయోగ్నొస్టిక్ సెంటర్‌లో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఎముకల విభాగం, అప్తమాలజీ, గైనిక్, ఈఎన్‌టీ, పిడియాట్రిక్ ఓపీ విభాగాలు ఉన్నాయి. ఆయా ఓపీ విభాగాల్లో సేవలు పొందేందుకు కార్మిక కుటుంబసభ్యులు ప్రతి రోజు 50 నుంచి 60 మంది వరకు వస్తారు.

జాడే లేని ఎల్‌ఎఫ్‌టీ పరీక్ష

డయోగ్నొస్టిక్ సెంటర్‌లో ఎల్‌ఎఫ్‌టీ (లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్) జరగడం లేదు. దీంతో కార్మికులు ఈ టెస్టు కోసం ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తూ రూ.300 నుంచి రూ.400 వరకు ఖర్చు చేస్తున్నారు.

సెంటర్ పరిధిలో 21 వేల మంది కార్మికులు

ఈఎస్‌ఐ డయోగ్నొస్టిక్ సెంటర్ పరిధిలో 21 వేల మంది కార్మికులు ఉన్నారు. వారంతా ఏదైనా జబ్బు చేస్తే చికిత్స కోసం వస్తారు. ఓపీ సేవలు అవసరమైన వారికి ఇక్కడ చికిత్స అందిస్తారు. ఇన్‌పేషెంట్ సేవలు అవసరమైన వారికి విశాఖలోని మల్కాపురంలో ఉన్న ఈఎస్‌ఐ ఆస్పత్రికి రిఫర్ చేస్తారు.



పెచ్చులూడుతున్న భవనం



రేడియోగ్రాఫర్ లేక పోవడంతో మూసి ఉన్న ఎక్స్‌రే విభాగం గది

శిథిలావస్థకు చేరిన భవనాలు

ఈఎస్‌ఐ డయోగ్నొస్టిక్ సెంటర్ భవనాలు శిథిలావస్థకు చేరాయి. భవనాలన్నీ పెచ్చులు ఊడిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని కార్మికులు, సెంటర్ వైద్య సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. గాజులరేగ వద్ద నిర్మాణంలో ఉన్న ఈఎస్‌ఐ 100 పడకల ఆస్పత్రి నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా ఇంకా పూర్తి కాలేదు.

రేడియోగ్రాఫర్ లేరు

ఎక్స్‌రేలు తీసే రేడియోగ్రాఫర్ వేరే ఉద్యోగం వచ్చి వెళ్లి పోయారు. దీంతో ఎక్స్‌రేలు తీయడం లేదు. రేడియాగ్రాఫర్‌ను నియమించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. సెంటర్‌ను ప్రైవేట్ భవనంలోకి మార్చాలని ప్రతిపాదన ఉంది. త్వరలోనే మార్చే అవకాశం ఉంది. – డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, సూపరింటెండెంట్, ఈఎస్‌ఐ డయోగ్నొక్ సెంటర్